
బాబూ.. మీకే మా ఓటు : అమర్‌నాథ్‌తో ముచ్చటిస్తున్న వృద్ధురాలు



సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి : మహిళలకు, పండ్ల వ్యాపారికి కరపత్రాలు అందిస్తున్న గుడివాడ అమర్‌నాథ్


విజయం మనదే : సత్తెమ్మతల్లి ఆలయం వద్ద కత్తితో అమర్‌నాథ్

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్
- 65, 87 వార్డుల్లో విస్తృత ప్రచారం

పెదగంట్యాడ: గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి చూసి తనకు ఓటేయాలని గాజువాక నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ ప్రజలను కోరారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామన్నారు. గాజువాక నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. జీవీఎంసీ 65వ వార్డులోని రాజీవ్‌మార్గ్‌లో గురువారం ఆయన ప్రచారం చేశారు. ముందుగా సత్తెమ్మతల్లి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం వార్డులోని రాజీవ్ మార్గ్, భానోజీ కాలనీ, కాకతీయ ఆర్చ్ తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడితో కలసి పర్యటించారు.

మహిళలు అడుగడుగునా వారికి మంగళహారతులు పట్టారు. జై జగన్.. జైజై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ ఇంటింటికీ వెళ్లి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా తనకు, విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీకి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో అవకాశం ఇచ్చి, ఆశీర్వదిస్తే ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు.

యుద్ధంలో న్యాయానిదే గెలుపు

పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధంలో న్యాయమే గెలుస్తుందని అమర్‌నాథ్ అన్నారు. రాష్ట్రంలోని మొత్తం 175 స్థానాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచి దేశంలో చరిత్ర సృష్టించనున్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో స్టార్ క్యాంపైనర్లు పేద ప్రజలే అన్నారు. నా కల గాజువాక నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా చూడడమే అన్నారు. పేదలకు సేవచేసే అవకాశం ఇవ్వాలని, ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. తద్వారా గాజువాకలో ఏ సమస్య వచ్చినా, దానిని వెంటనే పరిష్కరిస్తానన్నారు.


మహిళకు కరపత్రం అందిస్తున్న అమర్‌నాథ్

జగన్‌బాబునే గెలిపించుకుంటాం

జగన్ బాబు అందిస్తున్న పథకాలతో మా బతుకులు బాగుపడ్డాయి. ఆ బాబునే మళ్లీ గెలిపించుకుంటామని మహిళలు, వృద్ధులు స్పష్టం చేశారు. తమ సమస్యలన్నీ పరిష్కారమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారంతా వైఎస్సార్ సీపీకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మహిళల స్పందనే ఇందుకు నిదర్శమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, మంత్రి రాజశేఖర్, నాయకులు మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, మద్ది శంకర్‌రెడ్డి, దొడ్డి రమణ, మంత్రి మంజుల, మంత్రి శంకరనారాయణ, పల్లా చినతల్లి, పెంట్ర రాజు, పుష్ప, రామలక్ష్మి, శౌకత్ ఆలీ, రెడ్డి జగన్నాథం, మంగునాయుడు, పూర్ణానంద శర్మ, ఆర్మీ సతీష్, గొల్లపల్లి రాంబాబు, దేవి తదితరులు పాల్గొన్నారు.

గాజువాకను నంబర్–1గా తీర్చిదిద్దుతాం

కూర్మన్నపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగులకు.. మరీ ముఖ్యంగా మహిళలకు చేసినంత మేలు మరే ముఖ్యమంత్రి చేయలేదని గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అటువంటి పాలనలో గాజువాక నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలబెట్టడమే లక్ష్యంగా ఎన్నికల్లో పోటీపడుతున్నానని తెలిపారు. తనను ఆశీర్వదించాలని కోరారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి కాలనీలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా విచ్చేసిన అమర్‌నాథ్‌కు మహిళలు పూలవర్షంతో, మంగళ హారతులతో నీరాజనాలు పలుకుతూ ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా కణితి గవరవీధి రామాలయంలో, గవరవీధి దుర్గమ్మ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అప్పికొండ వెలమవీధి, అంబేద్కర్‌కాలనీ తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గాజువాక వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ వీవీఎస్ఎమ్ రాజు, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, ఎన్నేటి రమణ, బొడ్డేటి మోదినాయుడు, కాండ్రేగుల రమణ, అప్పల నాయుడు, కరణం పెంటారావు, పోలవరపు నాగవేణి, గెద్దాడ చిన్నప్పన్న, ముద్దపు దామోదర్, సారిపల్లి దేవుడు, గాలి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


87వ వార్డులోని ఎన్నికల ప్రచారంలో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు

క్లుప్తంగా

విశేష అలంకరణలో తిరుమలేశుడు


మల్లెపూల అలంకరణలో తిరుమల బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామివారిని గురువారం మల్లె పువ్వులతో విశేషంగా అలంకరించారు. వేకువజామున అభిషేకాలు, ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి దర్శనాలకు భక్తులను అనుమతించారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

31న రక్తదాన శిబిరం

ఉక్కునగరం: సత్యసాయి సేవా సమితి, ఉక్కునగరం ఆధ్వర్యంలో ఈ నెల 31న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరం పోస్టర్‌ను సమితి కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) సహకారంతో సత్యసాయి మందిరంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, యూత్ కో–ఆర్డినేటర్ ప్రకాశ్, సర్వీస్ కో–ఆర్డినేటర్ ఆనంద్, జేసీఐ ఉక్కునగరం ఉపాధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలోని కాపు జగ్గరాజుపేట వద్ద విశాఖ నుంచి అనకాపల్లి వెళ్లే రైల్వే ట్రాక్‌పై గురువారం ఉదయం 9గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి (36 నుంచి 38 సంవత్సరాలు) మృతదేహం ఉన్నట్టు కీమ్యాన్ గుర్తించి, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దువ్వాడ జీఆర్పీ ఔట్‌పోస్ట్ ఎస్ఐ శాంతారామ్ సిబ్బంది రాజు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని శరీరంపై కేవలం ఎరుపు రంగు షార్ట్ మాత్రమే ఉందని, ఇతర వివరాలేమీ లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

7 నుంచి ఉగాది సంబరాలు


ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు చిన నడుపూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో వచ్చే నెల 7 నుంచి 9 వరకు ఉగాది సంబరాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి ఇందల ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఉత్సవాల పోస్టర్‌ను ఆలయ ఆవరణలో కేఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, గంధం శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. ఈశ్వరరావు మాట్లాడుతూ ఉగాది సంబరాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఉగాది రోజున పంచాంగ శ్రవణం ఉంటుందని తెలిపారు. సియ్యాద్రి అప్పలరాజు, రౌతు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉక్కు భద్రతా దినోత్సవం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో జాతీయ ఉక్కు భద్రతా దినోత్సవం (స్టీల్ సేఫ్టీ డే)ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈడీ (వర్క్స్) బిల్డింగ్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన వేడుకలను రాష్ట్ర జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర రెడ్డి, స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోత్బీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆహూతులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శివశంకరరెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భద్రతతో విధులు నిర్వహించడం ద్వారా ప్రమాద రహిత పరిశ్రమగా స్టీల్‌ప్లాంట్‌ను తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో సీజీఎం ప్రవీణ్ కుమార్, భద్రతా విభాగాధిపతి డి.రామ్‌ప్రసాద్‌తో, పలువురు జీఎంలు, వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు, సెంట్రల్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


భద్రతా ప్రతిజ్ఞ చేస్తున్న జేసీఐఎఫ్ శివశంకరరెడ్డి, సీజీఎం సోత్బీ

వైభవంగా మరిడిమాంబ జాతర

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామ ఇలవేల్పు మరిడిమాంబ అమ్మవారి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. నిర్వాసిత కాలనీల భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి అమర్‌నాథ్, టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి దర్శించుకుని, పూజలు చేశారు. సాయంత్రం సదరంపట్టు నుంచి అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జానపద నృత్యాలు, సాము గరిడీలు, కోలాటం, బల్ల వేషాలు, పులివేషాలతో కోలాహలం నెలకొంది. కార్యక్రమంలో ఆలయ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సెక్టార్–5లో..

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–5 మరిడిమాంబ ఆలయం వద్ద అమ్మవారి ఉత్సవం ఘనంగా జరిగింది. దుగ్గపువానిపాలెం గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో ఆ గ్రామ ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అనంతరం తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 87వ వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద, ప్రగడ అప్పల నరసింహులు, డి.వి.అప్పారావు, బొడ్డు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


పూజలందుకున్న మరిడిమాంబ అమ్మవారు

1141వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1141వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్, అడ్మినిస్ట్రేషన్, ఆర్ఎండీ విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను సహజ మరణం దిశగా నెడుతూ అన్ని రంగాల్లో కోలుకోలేని దెబ్బ కొడుతున్నారని విమర్శించారు. ఉత్పత్తికి కావల్సిన ముడి సరుకును అందించకుండా ఉత్పత్తిని నిలిపివేయడం, తద్వారా అమ్మకాలు తగ్గి లాభాల్లో ఉన్న కంపెనీని భారీ నష్టాల వైపునకు నెట్టారని ఆరోపించారు. ఈ పరిణామంతో వేలాది మంది కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు భారీగా తగ్గిపోయాయని, ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆర్.నారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, నాయుడు, బాబూరావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

ఎన్నికల నియమావళి పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

విశాఖ సిటీ: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పరిశీలన, పర్యవేక్షణ కోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు, నాలుగు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) బృందాలను నియమించారు. ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులపై ఎంసీసీ బృందాలు విచారణ చేపట్టి నివేదికను సమర్పించనున్నాయి. ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సిద్ధం చేశారు. గాజువాక నియోజకవర్గానికి సంబంధించి.. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు ..

బృందం	అధికారి	హోదా	ఫోన్ నంబర్
టీమ్–1	సన్యాసినాయుడు	జోన్–6 జెడ్సీ	9666673949
	జె.కెన్నెడి	ఏఎస్ఐ	8185077737
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు			
టీమ్–1	రాము	జీవీఎంసీ గాజువాక ఏపీడీ	7729995925
	ఎండీ ఖుద్దుషీ	హెచ్‌సీ	8501879554
టీమ్–2	రేవతి	గాజువాక టీపీఓ	7729995916
	సి.హెచ్.వి.మోహనరావు	స్టీల్‌ప్లాంట్ ఎస్ఐ	9441120377
టీమ్–3	ఎస్.కిరణ్‌కుమార్	జోన్–6 ఏఎంఓహెచ్	9441883442
	పి.వరహాలరాజు	దువ్వాడ హెచ్‌సీ	9440788599

వివాహితను రక్షించిన లైఫ్‌గార్డ్స్


తేజుతో లైఫ్‌గార్డ్స్, న్యూపోర్టు పోలీసులు

పెదగంట్యాడ: కుటుంబ కలహాల కారణంగా యారాడ తీరంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వివాహితను లైఫ్‌గార్డ్స్ రక్షించారు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపురం ప్రాంతం శ్రీహరిపురానికి చెందిన తేజు (24) భర్త అచ్యుత్‌తో గొడవపడి గురువారం మధ్యాహ్నం యారాడ తీరానికి చేరుకుంది. ఆత్మహత్య చేసుకునేందుకు సముద్రంలోకి దిగుతుండగా అక్కడే ఉన్న లైఫ్‌గార్డ్స్ కె.లోవరాజు, కె.వెంకటేష్, సీహెచ్ శ్రీనివాస్ గమనించారు. వెంటనే ఆమెను ఒడ్డుకు చేర్చారు. ఆపై న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఒడిశా మద్యం స్వాధీనం

పరవాడ: మండలంలోని తానాంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు పర్యవేక్షణలో పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. పెందుర్తికి చెందిన సుశాంత్ పాత్రో, కొత్తవలసకు చెందిన లంక గౌరీశంకర్ కలిసి తమ బొలెరో వాహనంలో ఒడిశా జిల్లా బరంపురం నుంచి ఒడిశా మద్యం 146 క్వార్టర్ సీసాలను తీసుకొని వస్తుండగా.. తానాం సమీపంలో పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు. దాడిలో లభ్యమైన మద్యం సీసాల విలువ రూ.19,194 ఉంటుందని, మద్యం సీసాలతో సంబంధం ఉన్న ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసి, వాహనాన్ని సీజు చేశామని సీఐ బాలసూర్యారావు తెలిపారు.

కార్మికులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ఏప్రిల్ 1 నాటికి జీతాలు చెల్లించాల్సిందే అని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ నాయకులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం జి.గాంధీ కార్మిక సంఘాలతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఆశించినంతగా సేల్స్ లేదని, మార్చి నెలాఖరుకు చెల్లించాల్సిన పద్దులు ఎక్కువగా ఉన్నందున కార్మికులకు జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతుందని తెలిపారు. దీనిపై కార్మిక నాయకులు అభ్యంతరం తెలిపారు. ఒక వైపు బయోమెట్రిక్ అంశంపై సీఎండీ ఒకటి చెబుతుండగా, విభాగాధిపతులు మరో విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉక్కు అమ్మకాలు, రాయబరేలీ ప్లాంట్ అమ్మకం ద్వారా వచ్చిన నగదు ఉండగా కార్మికులకు జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతుందని చెప్పడం ఏంటని ప్రశ్నించగా వెంటనే సమావేశం ముగించారని నాయకులు తెలిపారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితులకు జరిమానా

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పలు చోరీ కేసుల్లో నిందితులకు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఆ కేసులకు సంబంధించి గాజువాక క్రైం ఎస్ఐ మన్మథరావు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక గణపతినగర్‌కు చెందిన బూసరాము 2018లో హిమాచల్‌నగర్ ప్రాంతంలో ఉన్న ఉరుకూటి వాసు అనే వ్యక్తి ఇంట్లో రాత్రి సమయంలో సెల్ ఫోన్ దొంగతనానికి పాల్పడ్డాడు. వాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన అప్పటి గాజువాక ఎస్ఐ వెంకటరావు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుపై ఏపీపీ టి.వాణి ఆధ్వర్యంలో వాదనలు విన్న అనంతరం నేరం రుజువు కావడంతో గాజువాక 3వ ఏసీఎంఎం జడ్జి వి.పల్లవి నిందితుడికి రూ.5 వేలు జరిమానా లేదా ఒక నెల జైలు శిక్ష విధించారని ఎస్ఐ తెలిపారు. దానితో పాటు పలు దొంగతనాల కేసుల్లో నిందితులైన అసనాల లక్ష్మికి ఆరు నెలల జైలు శిక్ష, పి.జ్యోతికి రూ.5 వేలు జరిమానా లేదా ఒక నెల జైలు శిక్షను విధించారని తెలిపారు. చీపుర్ల రాజు, కుండి శివ, డి.నాగరాజుకు ఆరు నెలల జైలు శిక్షను విధించారన్నారు.

ఘనంగా వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం

ఉక్కునగరం: వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్టీల్‌ప్లాంట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌టీయూసీ 12 వసంతాలు పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఉక్కునగరం యూనియన్ కార్యాలయం వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ చరిత్రలో మొదటిసారి 900 పైగా ఓట్లు సాధించిన ఘనత వైఎస్సార్‌టీయూసీకి మాత్రమే దక్కుతుందన్నారు. జాతీయ కార్మిక సంఘాలకు దీటుగా కార్మికుల పక్షాన పోరాడుతూ అన్ని ఎన్నికల్లో ముఖ్యపాత్ర పోషిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలోనూ ముఖ్య భూమిక వహిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రి దాలినాయుడు, ఎన్నేటి రమణ, జి.రమణారెడ్డి, జి.అప్పలరెడ్డి, నక్క వెంకటరమణ, బి.రామకృష్ణ, పిట్టా రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, దరిగి రవి తదితరులు పాల్గొన్నారు.


స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మూల్యాంకన విధుల్లో వారికి మినహాయింపు ఇవ్వాలి

విశాఖ విద్య: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం విధులకు ప్రత్యేక అవసరాల ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమండి పైడిరాజు కోరారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి గురువారం డీఈవో ఎల్.చంద్రకళకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా మూల్యాంకనం కేంద్రంలో తగిన మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు మూల్యాంకనం విధులను కేటాయించవద్దని, ఈ విషయంలో వారి అభ్యర్థనను పరిశీలించాలిన కోరారు. దీనిపై డీఈవో సానుకూలంగా స్పందించారని పైడిరాజు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దేముడు బాబు, డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమాంబ పండగ

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం గ్రామస్తుల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి జాతరను కనులపండువగా జరిపించారు. లంకెలపాలెం, పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, నాయకులు సుందరపు అప్పారావు, యలమర్తి వెంకటరావు, కాతా నూకేష్, దిగుమర్తి కాశీరావు తదితరులు పాల్గొన్నారు.


దుర్గమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్